క్లుప్తంగా

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు వెంటనే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సభ్యుడు సురేంద్రయాదవ్, కల్లూరు మండలం కార్యదర్శి కృష్ణానాయక్ డిమాండ్ చేశారు. గురువారం కర్నూలులో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల సమస్యలను పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎంతో ఆశతో చంద్రబాబుకు ఓట్లు వేసి గెలిపిస్తే అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సీ.క్యాంపు రైతుబజారును శుక్రవారం బంద్ చేస్తున్నట్లుగా ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్ తెలిపారు. రైతుబజారుకు ఇటు వినియోగదారులు, అటు రైతుల తాకిడి ఎక్కువగా ఉన్నందున పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా ప్రతి నెలా ఒక రోజు బంద్ చేసి శానిటేషన్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఇందులో భాగంగానే ఈ నెల 25న రైతుబజారును బంద్ చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వినియోగదారులు గమనించాలని కోరారు. శనివారం నుంచి రైతుబజారు యథావిధిగా పనిచేస్తుందని తెలిపారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీలను బాగుచేయాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరం 20వ వార్డు పరిధిలోని అంబేడ్కర్‌నగర్, అరుంధతి కాలనీ,మారుతి నగర్‌లో దెబ్బతిన్న సీసీ రోడ్లు, డ్రైనేజీలను బాగుచేయాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీపీఐ నాయకులు వార్డులో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అధిక వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. వెంటనే రోడ్లు, డ్రైనేజీలను బాగుచేయాలని కోరారు. నగర సహాయ కార్యదర్శి సి.మహేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి పశుగణన

కర్నూలు (సెంట్రల్): జిల్లాలో ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు పశుగణనను చేపట్టనున్నారని, ఇందుకోసం రైతులు తమ పశువుల వివరాలను తెలపాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా రైతులకు సూచించారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ రూపొందించిన 21వ అఖిలభారత పశుగణన ఆంధ్రప్రదేశ్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగణనకు రైతులు సహకరించాలని కోరారు. ఈ గణన ద్వారా పశుసంక్షేమం కోసం పలు పథకాలను రూపొందించే అవకాశముందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు

కర్నూలు(హాస్పిటల్): ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ సెక్రటరీ వారు డిప్లొమా పారామెడికల్ కోర్సుల కన్వీనర్ కోటా దరఖాస్తులకు గడువు నవంబర్ 3వ తేదీ వరకు పొడిగించారని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు నవంబర్ 12వ తేదీ వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఈ కోర్సుకు ఇంటర్ పాసైన విద్యార్థులు అర్హులని తెలిపారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తగు ధ్రువపత్రాలతో దరఖాస్తు చేయాలని సూచించారు. వివరాలకు 93922 51434, 79950 13422 ఫోన్ నంబర్లు లేదా బొల్లినేని మెడ్‌స్కిల్స్ పారామెడికల్ ఇన్‌స్టిట్యూషన్స్, కిమ్స్ హాస్పిటల్ క్యాంపస్, జొహరాపురం, కర్నూలులో సంప్రదించాలన్నారు.

కర్నూలు ఏఓగా రూఫస్ రొనాల్డ్

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలు మండల వ్యవసాయ అధికారిగా రూఫస్ రొనాల్డ్ నియమితులయ్యారు. ఇప్పటివరకు విజిలెన్స్‌లో ఏఓగా పనిచేసిన ఆయన మాతృశాఖకు బదిలీ అయ్యారు. దీంతో పోస్టింగ్ కోసం కమిషనరేట్‌లో రిపోర్ట్ చేసుకున్నారు. ఈయన్ను ఖాళీగా ఉన్న కర్నూలు మండల వ్యవసాయ అధికారిగా నియమిస్తూ వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం సాయంత్రం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న విశ్వనాథ్ విజిలెన్స్ ఏఓగా బదిలీ అయిన విషయం తెలిసిందే.

ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్ల ప్రకటన

కర్నూలు (టౌన్): సత్యసాయి జిల్లా హిందూపూర్ పట్టణంలో ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 ఫుట్‌బాల్ పోటీల్లో సత్తా చాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, స్పోర్ట్స్ ప్రమోటర్ శ్రీధర్ రెడ్డి సూచించారు. ఆ మేరకు గురువారం జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గిడ్డయ్య రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే బాలబాలికల జట్లను ప్రకటించారు. బాలుర జట్టులో తాయన్న, వినయ్, యశ్వంత్, రేయాన్, అలీ, ఖలీల్, హరి వెంకట్, వీరేంద్ర, వరుణ్‌గౌడ్, హుస్సేన్ బాషా, రోహిత్, గౌతమ్, ప్రసాద్, పీటర్, కరుణాకర్, ఫరీద్, అబ్దుల్, తరుణ్, హసీబా బాలికల జట్టులో లాస్య, లతిక, శశికళ, వెన్నెల, గీత, అను, లలిత, ప్రవల్లిక, మానస, నికిత, చంద్రిక, బిందు మాదవి, అఖిల, ముస్కాన్, అనూష, కళావతి, జరీనాబీ, అఖిల ఉన్నారు.

మంత్రి ఇలాకాలో సమస్యల తిష్ట

- బళ్లారి చౌరస్తా మలుపు- మెడికల్ కళాశాల వద్ద విస్తరణ పనుల్లో జాప్యం
- సిఫార్సు చేసిన రహదారి వెడల్పు పనులు ఇంకెప్పుడు ?
- ఉన్న టెండర్ల రద్దు - కొత్త టెండర్ల పరిస్థితేంటి ?
- వాటర్ వర్క్స్ దోపిడీపై కదలని యంత్రాంగం
- అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చినా చర్యల్లేవు
- అటకెక్కిన వీధి కుక్కల నియంత్రణ- సంతాన నియంత్రణ ఆపరేషన్లకు బ్రేక్
- నేడు నగరపాలక సంస్థ పాలకవర్గ సర్వసభ్య సమావేశం



నగరపాలక సంస్థ కార్యాలయం

కర్నూలు (టౌన్): ప్రభుత్వం మారి 5 నెలలు కావొస్తోంది. కర్నూలు అర్బన్‌తో పాటు పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు అధికార పార్టీ నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయినా ఇప్పటివరకు చెప్పుకోదగ్గ అభివృద్ధి కనిపించడం లేదు. ఈ ఐదు నెలల్లో రెండు, మూడు సార్లు మంత్రి, ఎమ్మెల్యేలు సమావేశాలు నిర్వహించినా పనులు మాత్రం ముందుకు కదల్లేదు. ప్రత్యేకించి మంత్రి టీజీ భరత్ మున్సిపల్ అధికారులు, సెక్షన్ హెడ్‌లతో సమావేశాలు నిర్వహించి పలు సూచనలు చేశారు. వచ్చే సమావేశం లోపు పరిష్కరించాలని ఆదేశించారు. అయినా ఆ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఇక నగరంలోని బళ్లారి చౌరస్తా ఆంజనేయస్వామి గుడి మలుపు వద్ద రహదారిని విస్తరించేందుకు ఇప్పటికే ఏపీఎస్పీ అధికారులతో మాట్లాడారు. పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఇక రోడ్ల విస్తరణ పనులు సైతం అలాగే ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఈ పనులకు సంబంధించి నిధులు విడుదల చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు అవుతున్నా విస్తరణ పనులపై మీటింగ్‌కే పరిమితం అయ్యారు. స్థానిక పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి పెద్దమార్కెట్ రాఘవేంద్ర మఠం వరకు, కిడ్స్ వరల్డ్ నుంచి బాపూజీనగర్, కేవీఆర్ గార్డెన్, ఉస్మానియా కళాశాల, కల్లూరు దర్వాజా మీదుగా బుధవారపేట కలెక్టరేట్ వరకు రహదారులను విస్తరించాలని ప్రణాళిక రూపొందించడం, చర్చించడం జరిగింది. అయితే చర్చలకే పరిమతమయ్యారు. తప్పా పనులు ముందుకు సాగలేదు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యల్లేవ్

నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. గత నెలలో ఒకేరోజు పాతబస్తీలో 30 మందికి పైగా చిన్నారులను వీధికుక్కలు కరిచాయి. మంత్రి టీజీ భరత్ బాధితులను ఆసుపత్రిలో పరామర్శించారు. రూ.10 వేలు చొప్పున సాయం అందించారు. అలాగే వీధి కుక్కలకు ఆపరేషన్ల ప్రక్రియ త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవు.

టెండర్లు రద్దు చేసి కొత్తగా పిలవక..

కొత్త ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు అవుతోంది. ఇప్పటివరకు వినాయక నిమజ్జనం అత్యవసర పనులకు సంబంధించి షార్ట్ టెండర్లు తప్పా అభివృద్ధి పనుల టెండర్ల ప్రక్రియలో అంతులేని జాప్యం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పిలిచిన టెండర్లను సైతం రద్దు చేశారు. 25 శాతంలోపు పనులు చేసిన వాటిని రద్దు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వైఎస్సార్‌సీపీ పాలనలో 'గడప గడపకు మన ప్రభుత్వం' పేరుతో ప్రతి సచివాలయం పరిధిలోని కాలనీలలో ప్రజలు సూచించిన అభివృద్ధి పనులు చేపట్టగా వాటినీ ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. పాత వాటిని రద్దు చేసి, కొత్త వాటిని పిలవకపోవడంతో పాలన స్తంభించిందన్న విమర్శలు ఉన్నాయి.

వాటర్ వర్క్స్ దోపిడీపై చర్యలేవీ?

నగరవాసులకు సురక్షిత మంచినీరు సరఫరా చేయాలంటే వాటర్‌వర్క్స్ విభాగం కీలకం. ఈ విభాగంపై అనేక విమర్శలు వచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.కోట్లు కొల్లగొట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ పనిచేసే అధికారి బదిలీ కాకుండా ప్రజాప్రతినిధుల సిఫార్సుతో కొనసాగుతున్నారు. బినామీ పనులు, అత్యవసరం పేరుతో అనవసరమైన పనులు, పనిచేయకుండా ఇంటి వద్ద ఉన్నా జీతాలు మంజూరు చేయడం, ప్రతి అవసరానికి వర్క్ ఇన్‌స్పెక్టర్లను వాడుకోవడం వంటి విమర్శలు ఉన్నాయి. అయినా సదరు ఉన్నతాధికారులు కనీసం వాస్తవాలు తెలుసుకునేందుకు కూడా ప్రయత్నించకపోవడం గమనార్హం.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ ?

నగరపాలక సంస్థ పరిధిలో అనేక నిర్మాణాలు నిబంధనలు పాటించలేదు. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. వీటిపై చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక అధికారులు పత్రికలకు ప్రకటించారు. అక్రమ నిర్మాణాలను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేశారు. అంతే ఆ తరువాత ఏమైందో ఏమో యథావిధిగా మిన్నకుండిపోయారు. దీంతో అక్రమ నిర్మాణాలు వెలుస్తూనే ఉన్నాయి.

నేడు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం

నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో శుక్రవారం ఉదయం 11 గంటలకు పాలకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు గురువారం వెల్లడించారు. మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి టీజీ భరత్, కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరుచరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరి, డిప్యూటీ మేయర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో 7 తీర్మానాలు, పలు అంశాలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటారని వెల్లడించారు.

ఇన్‌ఫెక్షన్ రహిత ఆసుపత్రిగా మార్చాలి


సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డితో చర్చిస్తున్న ఐసీఎన్ కన్సల్టెంట్ డాక్టర్ నీరద

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఇన్‌ఫెక్షన్ రహిత ఆసుపత్రిగా మార్చు చేయాలని ఐసీఎన్ కన్సల్టెంట్ డాక్టర్ నీరద సూచించారు. గురువారం ఆసుపత్రిలో నిర్వహించిన టీబీ ముక్త్‌భారత్, ఐపీసీ శిక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ కోసం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్య సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్రిమిసంహారక, స్టెరిలైజేషన్ పర్యావరణ సంక్రమణ నియంత్రణ, చేతి పరిశుభ్రమైన ఐసోలేషన్ జాగ్రత్తలు, మల్టీ డ్రగ్-రెసిస్టెంట్ ఆర్గానిజమ్స్ తదితర విషయాలపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. అంటువ్యాధుల నివారణ, నియంత్రణలో వైద్య సిబ్బంది పాత్ర కీలకమన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డితో పలు విషయాలపై చర్చించారు. డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సునీల్ ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి పాల్గొన్నారు.

నర్సింగ్ అసోసియేషన్‌కు అభినందనల వెల్లువ

కర్నూలు(హాస్పిటల్): నూతనంగా ఏర్పడిన ఏపీ ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ కార్యవర్గానికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను నూతన కార్యవర్గసభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి తదితరులను కలిసి అభినందనలు అందుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం.లీలావతి, కార్యదర్శి సి.బంగారి, ట్రెజరర్ ఎస్.లక్ష్మీనరసమ్మ, ఈసీ మెంబర్లు యుఎం.శాంతిలత, ఎస్.సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పోస్టుల భర్తీలో అక్రమాలపై నిరసన


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీలో పారదర్శకతకు తిలోదకాలు ఇచ్చి అమ్ముకుంటున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ ఉదయ్ డిమాండ్ చేశారు. గురువారం పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేజీబీవీల్లో పోస్టుల భర్తీలో భాగంగా కర్నూలు జిల్లాకు సంబంధించి విడుదల చేసిన నోటిఫికేషన్‌లో సోషల్, సీఆర్‌టీ పోస్టులు ఉన్నట్లు చూపించారన్నారు. దీంతో వందలాది మంది అభ్యర్థులు ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకున్నారని, తీరా మెరిట్ లిస్టులో మాత్రం సోషల్, సీఆర్‌టీ పోస్టుల అభ్యర్థుల జాబితాను ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. ముందుగానే ఆయా పోస్టులను అమ్ముకున్నారని ప్రశ్నించారు. ఈ ఉదాంతంపై ఉన్నతాధికారులు విచారణ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు రాజు, ఆర్యన్, విశ్వ, అనిల్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలు సద్వినియోగం చేసుకోండి


సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ

కర్నూలు (టౌన్): నగరంలోని పలు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ సూచించారు. ఆయన గురువారం గొలిగేరి 129వ సచివాలయాన్ని మేనేజర్ చిన్నరాముడుతో కలిసి పరిశీలించారు. ఆధార్ నమోదు కోసం వచ్చిన మహిళలు, చిన్నారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. ఈ నెల 25వ తేదీ నాటికి నగరంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక క్యాంపులు ముగుస్తాయన్నారు. ఆధార్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. బయోమెట్రిక్, డెమోగ్రాఫిక్ అప్‌డేట్స్, చిరునామా, మొబైల్ నంబర్ అనుసంధానం వంటి సేవలను ఆధార్ క్యాంపులలో పొందవచ్చన్నారు. అలాగే పదేళ్లు దాటిన పిల్లలు తప్పనిసరిగా ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు, అనంతరం కొత్తపేట 128వ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఎస్వీని కలిసిన న్యూజిలాండ్ బృందం


ఎస్వీ స్వగృహంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న న్యూజిలాండ్ దేశస్తులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ అధ్యక్షురాలు ఎస్వీ విజయమనోహరి దంపతులను గురువారం న్యూజిలాండ్‌కు చెందిన క్రైస్తవ బృందం కలిసింది. కర్నూలులోని ఎస్వీ స్వగృహానికి వచ్చిన న్యూజిలాండ్‌కు చెందిన అపోస్టల్ నార్మ, ఎంసీ లియోడ్‌లు ఎస్వీ దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ స్మాలన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులపై అవగాహన


మాట్లాడుతున్న ఆత్మ పీడీ రత్నప్రసాద్

కర్నూలు(అగ్రికల్చర్): రబీలో ప్రధానంగా సాగు చేసే పంటల సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రత్నప్రసాద్ సూచించారు. గురువారం కర్నూలులోని ఉద్యాన భవన్‌లో కర్నూలు సబ్ డివిజన్‌లోని కల్లూరు, కర్నూలు, కోడుమూరు, గూడూరు, సీ.బెళగల్, ఓర్వకల్ మండలాల్లోని రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, ఏఈఓకు ఆత్మ ద్వారా రబీ పంటల సాగుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆత్మ పీడీ రత్నప్రసాద్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రబీ సీజన్‌కు సంబంధించి శనగ, జొన్న, మొక్కజొన్న, పొగాకు పంటలు సాగవుతున్నాయని.. సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. విత్తన రకాలు, విత్తనశుద్ధితో పాటు ఆయా పంటల్లో సోకే చీడపీడలు, వాటి లక్షణాలు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు, అధిక నికరాదాయం సాధించేందుకు సమగ్ర పంటల యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం పాటించాలని సూచించారు. కర్నూలు ఏడీఏ సాలురెడ్డి మాట్లాడుతూ.. పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకొని రైతుల్లోకి వెళ్లి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. రైతుల పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడంపై దృష్టి సారించాలని సూచించారు. ఆత్మ డీపీడీ శ్రీలత, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓలు శశిధర్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్ ఎంపిక ప్రక్రియపై అవగాహన


అగ్నివీర్ వాయు అవగాహన పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు పోస్టుల ఎంపిక ప్రక్రియపై గురువారం స్థానిక టౌన్ మోడల్ ప్రభుత్వ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. 12 ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్, సికింద్రాబాద్ నుంచి విచ్చేసిన కార్పొరల్ ఆఫీసర్స్ సందీప్, సూరీందర్ సింగ్ అగ్నివీర్ వాయు ఎంపికకు అవసరమైన అర్హతలు, ఎంపిక విధానం గురించి వివరించారు. జనవరి మాసంలో హైదరాబాద్‌లో ఓపెన్ ర్యాలీ (డైరెక్టర్ రిక్రూట్‌మెంట్) నోటిఫికేషన్ విడుదల చేస్తారని, అర్హత ఉన్న వారు నేరుగా సంబంధిత ధ్రువ పత్రాలతో హాజరుకావాలని కోరారు. ఆర్మీ ఉద్యోగాలపై సెట్కూరు సీఈఓ దీప్తి అవగాహన కల్పించారు. అగ్నివీర్‌లకు 4 సంవత్సరాల సర్వీసు తర్వాత వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలకు రిజర్వేషన్ ఉంటుందన్నారు. జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి పరమేశ్వరరెడ్డి, జూనియర్ కళాశాల లెక్చరర్లు, సెట్కూరు సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత తప్పనిసరి


పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న క్యూసీ డీఈఈ రవీంద్రారెడ్డి, హాజరైన పీఆర్ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

కర్నూలు(అర్బన్): జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీర్ వీ.రామచంద్రారెడ్డి సూచించారు. ఆయన గురువారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో కర్నూలు డివిజన్‌కు చెందిన పీఆర్ ఈఈ, డీఈఈ, ఏఈలతో పాటు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సీసీ రోడ్ల నిర్మాణాలు, నాణ్యతపై క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్లతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. మండలానికి రూ.2 కోట్ల ప్రకారం కర్నూలు డివిజన్‌కు రూ.24 కోట్లతో 401 సీసీ రోడ్లు మంజూరయ్యాయన్నారు. ఈ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు సిమెంట్, ఇసుక, మెటల్‌ను నిర్దేశించిన ప్రమాణాల మేరకు మిక్స్ చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే రోడ్ల నిర్మాణాల్లో కచ్చితంగా వైబ్రేటర్లు పెట్టాలని, రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం కచ్చితంగా 21 రోజులు వాటర్‌తో క్యూరింగ్ చేయాలన్నారు. ముఖ్యంగా ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు వేసే సమయంలో ఇద్దరు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పర్యవేక్షించాలన్నారు. అలాగే ఆయా సబ్ డివిజన్లకు సంబంధించిన డీఈఈలు ప్రతి పనిని పర్యవేక్షించాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ డీఈఈ వీ.రవీంద్రారెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీసీ రోడ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. పీఆర్ కర్నూలు ఈఈ ఎస్.మద్దన్న, డీఈఈలు నాగిరెడ్డి, కర్రెన్న, శేషయ్య, పీఏ టు ఎస్ఈ బండారు శ్రీనివాసులు, రమేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ఆవరణను శుభ్రంగా ఉంచాలి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రి ఆవరణను శుభ్రంగా ఉంచాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. ఆయన గురువారం ఆసుపత్రిలోని పలు విభాగాల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో జరిగిన పనుల గురించి సమీక్షించి వాటి పురోగతిపై ఆరా తీశారు. చాలా విభాగాల్లో డ్రైనేజీ, బాత్‌రూమ్‌లు బాగున్నాయని నర్సింగ్ సిబ్బందికి తెలిపారు. న్యూరో సర్జరీ విభాగంలో టైల్స్ మరమ్మతుల గురించి ఆరా తీశారు. వాటి మరమ్మతులకై అంచనాలను రూపొందించాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లను ఆదేశించారు. ఆక్సిజన్ ఫ్లో మీటర్‌లను ఆడిట్ చేసి స్టాక్ రిజిస్టర్ పరిశీలించి ఏ విభాగాల్లో ఉపయోగిస్తున్నారో వాటి వివరాలు సమర్పించాలని నర్సింగ్ సూపరింటెండెంట్‌కు ఆదేశించారు. మార్చురీ విభాగం వద్ద ఉన్న డ్రైనేజీ పనుల గురించి ఆరా తీసి పైప్‌లైన్ల ద్వారా డ్రైనేజీ మరమ్మతులను పూర్తి చేయాలన్నారు. డంప్ యార్డ్ దగ్గర ఉన్న వేస్టేజ్‌ను తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. హౌస్‌సర్జన్స్ క్వార్టర్స్ వద్ద ఉన్న డ్రైనేజీ, పిచ్చి మొక్కల తొలగింపు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫార్మసీ విభాగం రూపురేఖలు త్వరలో మార్చనున్నట్లు చెప్పారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న ఓపీ కౌంటర్ వద్ద రోగుల సౌలభ్యం కోసం షెడ్ల ప్రపోజల్ సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, న్యూ డయాగ్నోస్టిక్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ ప్రశాంత్, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు, ఏఓ శ్రీనివాసులు, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ వన్ సావిత్రిబాయి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అనఘాష్టమి వ్రతం

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్య నారాయణ స్వామి ఆలయంలో గురువారం అష్టమి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనఘాదేవి సమేత దత్తాత్రేయ స్వామికి అనఘాష్టమి వ్రతం, విశేష పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం


మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటు మాత్రమే అని యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కర్నూలు నియోజవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. గురువారం స్థానిక కేవీఆర్ కళాశాలలో స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఓటు హక్కు ప్రతీక అని, నిజాయితీ సమర్థత కలిగిన నాయకుడిని ఎన్నుకోవడానికి ఓటే వజ్రాయుదం అన్నారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటేనే ప్రజాస్వామ్యం పదికాలాల పాటు పరిఢవిల్లుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ లాలప్ప, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, అధ్యాపకులు నాగిరెడ్డి పాల్గొన్నారు.




మట్టి ప్రమిదలు.. మనసుదోచే ఆకృతులు

వెలుగులు నింపే దీపావళి పండుగ, పవిత్ర కార్తీక మాసంను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. పండుగ రోజున దీపాలు వెలిగించి లక్ష్మీదేవిని ఇంట్లోకి ఆహ్వానించేందుకు ప్రమిదలు, అలంకరణ సామగ్రి, పూజా సామగ్రి వంటి వాటిని కొనుగోలు చేస్తుండదంతో ఆ వ్యాపారం జోరందుకుంది. పలుప్రాంతాల నుంచి వ్యాపారులు లక్ష్మీ గణపతి బొమ్మలు, బుద్ధుడి విగ్రహాలు, ఏనుగుల బొమ్మలు, తాబేలు, తులసి బృందావనం, బుట్ట బొమ్మలు, కలశాలు, ఫ్లవర్ వాజ్‌లు, టెంకాయ ఆకారం, వివిధ రూపాల్లో ప్రమిదలు, మట్టి పాత్రలు వంటి సామగ్రిని తీసుకొచ్చి రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌లపై ఉంచి విక్రయాలు సాగిస్తుండగా మహిళలు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


సి.క్యాంప్ సెంటర్, మెడికల్ కళాశాల ఫుట్‌పాత్‌పై విక్రయానికి ఉంచిన ప్రమిదలు, అలంకరణ సామగ్రి